# యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనపై దృష్టి

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**


మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

**రాంగోపాల్‌పేట్:** నిరుద్యోగ యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు మరింత పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐటీ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 150 ఏళ్ల క్రితం స్వామి వివేకానంద చికాగో వెళ్లే ముందు ఇదే ప్రాంగణం నుంచి ఆయన సందేశాన్ని ఇచ్చారని ఇలాంటి చోట ఆయన పేరుతో ఏర్పాటైన విద్యా సంస్థలో చదువుతున్న విద్యార్థులు అదృష్టవంతులన్నారు. వివేకానందుడు బోధనలు యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్ల జోలికి వెళ్లకుండా తల్లిదండ్రులు, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట నారాయణ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ కేవీకే రావు, ఎస్వీఐటీ కార్యదర్శి హర్షా శశాంక్, సభ్యులు హరీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ స్పృహను రగిల్చిన నృత్య పోటీలు



**సనత్‌నగర్:** ప్రతి మదిలో పర్యావరణ స్పృహను కలిగించే లక్ష్యంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బృంద నృత్య పోటీలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. టీజీపీసీబీ ఆడిటోరియంలో జరిగిన ఈ పోటీల్లో భాగంగా మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వాయు, ప్లాస్టిక్ కాలుష్యం, ప్రజా రవాణా, భూగ్రహాన్ని రక్షించడం వంటి అనేక అంశాల్లో కొనసాగిన నృత్యాలు ఆలోచింపజేశాయి. నృత్య మాధ్యమం ద్వారా పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజానికి అవగాహన అవసరమని నొక్కి చెప్పారు. సృజనాత్మకతకు ప్రత్యేక గుర్తింపుతో బాల కళాకారులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారులు ప్రభాకర్, దేవేందర్, పీసీబీ అధికారులు సుమతి, ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ మాధురి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, సిబ్బంది పాల్గొన్నారు.

# 14 టేబుళ్లు.. 400 సిబ్బంది!

- భారీ పోలీసు బందోబస్తు
- ఇప్పటికే శిక్షణ పూర్తి

**ఎంపీ ఓట్ల లెక్కింపునకు ఓయూ ప్రాంగణంలో ఏర్పాట్లు**


కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి సమీక్ష నిర్వహిస్తున్న సికింద్రాబాద్ ఎన్నికల అధికారులు

**సికింద్రాబాద్:** పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఓట్ల లెక్కింపు కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జూన్ 4న జరగనున్న లెక్కింపు ప్రక్రియకు సంబంధించి నియోజకవర్గ ఎన్నికల అధికారులు జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సహాయక ఎన్నికల అధికారులు సుభాష్‌రావు, ఎల్లారెడ్డి నేతత్వంలో నిర్వహించిన సమావేశంలో ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులు, సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు.

**52.48 శాతం పోలింగ్..**

సికింద్రాబాద్ శాసనసభ నియోజకవర్గం పరిధిలో మొత్తంగా 2,66,337 ఓటర్లు ఉండగా 1,39,761 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. 70,702 మంది పురుషులు, 69,051 మంది మహిళలు, 8 మంది ఇతరులు ఉండగా 52.48 శాతం పోలింగ్ నమోదైంది. పోలైన ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ప్రాగణంలోని ప్రొఫెసర్ రాం రెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ భవనంలో నిర్వహించనున్నారు. పోలింగ్‌కు ముందే ఈ భవనంలో రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను ఇదే భవనంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు.

**42 మంది బరిలో..**

కౌంటింగ్ విధులు నిర్వహించేందుకు 400 మంది సిబ్బందిని నియమించినట్టు అధికారులు తెలిపారు. 14 టేబుళ్లకు ఒక రౌండ్ చొప్పున ఏర్పాటు చేశారు. ఎన్నికల లెక్కింపు కోసం ఒక్కో టేబుల్‌కు సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో ఆఫీసర్‌ను నియమించారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు సంబంధించి పోలింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియను కూడా పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు. 42 మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో లెక్కింపు ఆలస్యం జరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**నిరంతరం నిఘా..**

ఓయూ ప్రాంగణంలో సికింద్రాబాద్, సనత్‌నగర్ రెండు అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరగనున్న క్రమంలో ఈస్ట్ జోన్ పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఇప్పటికే రెండు స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేసిన అధికారులు, లెక్కింపు రోజున రెడ్ అలర్ట్ ప్రకటించనున్నారు. తార్నాక నుంచి విద్యానగర్, ఓయూ నుంచి డీడీ కాలనీకి వెళ్లే రహదారుల్లో భారీ భద్రత ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రవేశాలపై ఆంక్షలు విధించారు. మొత్తంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భారీ భద్రతతో పాటు నిరంతరం నిఘా ఉంచేలా ఏర్పాటు చేశారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**సనత్‌నగర్:** ఈఎస్ఐ, గ్రీన్‌ల్యాండ్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జెక్‌కాలనీ ఫీడర్ పరిధిలోని హిందూ పబ్లిక్ స్కూల్, శ్రావణ్‌కుమార్ డీటీఆర్, జెక్‌కాలనీ పార్క్, గ్రీన్‌ల్యాండ్స్, నీరజ్ పబ్లిక్ స్కూల్, అపరాజితకాలనీ. సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు మున్సిపల్ పార్కు ఫీడర్ పరిధిలోని ఉదయ్‌నగర్, రవీంద్రనగర్, 60 ఫీట్ల రోడ్డు, శ్యామలకుంట పార్కు ఏరియా, ఎంసీహెచ్ మార్కెట్ ఫీడర్ పరిధిలోని అపరాజితకాలనీ, సదైత్ మంజిల్, ఎంసీహెచ్ మార్కెట్, ఎస్ఆర్‌టీ కాలనీ, ఆర్‌బీఐ క్వార్టర్స్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

**మోండా మార్కెట్, పాటిగడ్డ సబ్‌స్టేషన్ల పరిధిలో..**

**రాంగోపాల్‌పేట్:** ఫీడర్ల మరమ్మతుల కారణంగా మోండా మార్కెట్, పాటిగడ్డ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సికింద్రాబాద్ ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు గాంధీనగర్ పీఎస్ ఫీడర్ పరిధిలోని గాంధీనగర్ పీఎస్ ప్రాంతం, బోయిగూడ గార్డెన్, సున్నంబట్టి, రైల్వే క్వార్టర్స్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాటా ఫీడర్ పరిధిలోని ఆర్పీరోడ్, ఓల్డ్ గాస్మండి, బొటనీ స్కూల్, వాటర్ వర్క్స్, బన్సీలాల్‌పేట్ క్లాస్ ఏబీసీ ప్రాంతాలు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2.30 వరకు దర్యకాంట ఫీడర్ పరిధిలోని మానస నర్సింగ్‌హోం, టెలిఫోన్ భవన్, కిమ్స్ మెయిన్‌రోడ్ ప్రాంతాలు. సాయంత్రం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు జీరా ఫీడర్ పరిధిలోని రాణిగంజ్ బస్ డిపో, అంబేడ్కర్‌నగర్‌లో విద్యుత్ కోత ఉంటుందన్నారు.

## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

**సనత్‌నగర్:** టమాటా రూ.29, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండ 23, గుండుబీన్స్ 125, గింజ చిక్కుడు 75, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 23, రూట్ రూట్ 17, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 32, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

# తెలంగాణ గీతంపై రాద్ధాంతం తగదు


మాట్లాడుతున్న కోట శ్రీనివాస్‌గౌడ్

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఫోన్ ట్యాపింగ్ కేసును పక్కదారి పట్టించేందుకే జయ జయ హే తెలంగాణ గీతంపై బీఆర్ఎస్ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ కార్య నిర్వాహకులు కోట శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కవి, గాయకుడు అందెశ్రీ రాసి పాడిన తెలంగాణ గీతాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అమరుల స్థూపం, సచివాలయం, యాదగిరి గుట్ట, కాళేశ్వరం ప్రాజెక్టు పనులతో పాటు ఇతర భారీ నిర్మాణాలను ఆంధ్రులతో చేయించి కేవలం తెలంగాణ గీతానికి ఎంఎం కీరవాణి సంగీతం చేపడితే విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్, వెంకట్ నాయక్, పవన్, జశ్వంత్, బాలకృష్ణ, నాంపల్లి వెంకటరమణ, రాము, వినయ్, రామకృష్ణ పాల్గొన్నారు.

# తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత


అభిషేక్ కుమార్‌ను తల్లితండ్రులకు అప్పగించిన రైల్వే పోలీసులు

**సికింద్రాబాద్:** సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన బాలుడిని గుర్తించిన రైల్వే పోలీసులు తల్లితండ్రులకు అప్పగించారు. ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎం. వెంకటరెడ్డి కథనం ప్రకారం..ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కుటుంబం గురువారం తమ పిల్లలను తీసుకుని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలు కోసం జనరల్ వెయిటింగ్ హాల్లో ఎదురుచూస్తుండగా రెండున్నరేళ్ల వయస్సున్న వారి కు మారుడు అభిషేక్‌కుమార్ కనిపించకుండ పో యాడు. పరిసరాల్లో వెదికినా ఫలితం లేకపోవడంతో రైల్వే పోలీసులను ఆశ్రయించారు. ప్రత్యే క బృందంగా ఏర్పడిన పోలీసులు రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా గాలించగా 2వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.



# రోడ్లపై గుంతలు.. అధికారుల కళ్లకు గంతలు!



తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధి లాలాపేటలోని పలు బస్తీ, కాలనీల్లో రోడ్లపై గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. లాలాపేట సత్యానగర్, ఇందిరానగర్, ఈదమ్మగుడి తదితర ప్రాంతాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో డ్రైనేజీ నీరు చేరి బురదమడుగుగా మారింది. రాత్రి సమయంలో ఈ మార్గాల్లో ద్విచక్ర వాహన దారులు ప్రమాదాల బారిన పడ్డ ఘటనలు ఉన్నాయని వర్షాకాలం ప్రారంభం కాకముందే రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయాలని సోషల్ వర్కర్ మహేష్‌తో పాటు ఆయా కాలనీలవాసులు కోరుతున్నారు.

–లాలాపేట

## నేడు అనఘావ్రతం

**సనత్‌నగర్:** వైశాఖ మాసం బహుళ అష్టమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలోని శ్రీదత్తాత్రేయస్వామి దేవాలయంలో శుక్రవారం (నేడు)ఉదయం 9.30 గంటలకు అనఘావ్రతం జరుగుతుందని ఈఓ శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

## రేపు రామనామ సంకీర్తనం

**సనత్‌నగర్:** హనుమాన్ జయంతి సందర్భంగా మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1న సాయంత్రం 6.30లకు సనాతన భజన మండలి వారిచే 'బంటురీతి కొలువీయవయ్య రామా' రామనామ సంకీర్తనం జరపనున్నట్లు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జేపీ స్టీ శాయి, ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబులు ఓ ప్రకటనలో తెలిపారు. అంతకు ముందు సాయంత్రం 5 గంటలకు స్వామివారికి అభిషేకం, ఆకుపూజ, 5.30 గంటలకు సనత్‌నగర్ శ్రీహనుమాన్ దేవస్థానం సత్సంగ్ సభ్యులతో 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని వివరించారు.

## ఓయూలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూలో జూన్ 2న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఓయూ విద్యార్థి జేఏసీ కన్వీనర్ తల్లమల్ల శ్వేతహాసేన్ తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లైన సందర్భంగా తెలంగాణ కోసం పోరాడిన విద్యార్థి జేఏసీ నేతలతో జూన్ 2న ఉదయం 9 గంటలకు ఆర్ట్స్ కాలేజీ ఎదుట మొదటి దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యమగడ్డ ఉస్మానియా వేదికగా మలిదశ తెలంగాణ ఉద్యమంలో వీరోచితంగా పోరాడిన విద్యార్థి నేతల ఉద్యమ జ్ఞాపకాలను స్మరిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## కుల జనగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** కుల జనగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో గురువారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధిపత్య కులాల యాజమాన్యంలోని రాజకీయ పార్టీలు ఎన్నికలను లాభసాటి వ్యాపారంగా మార్చాయని విమర్శించారు. ఎన్నికలకు ముందు 60 శాతం ఉన్న బీసీ కులాలపై ఎనలేని ప్రేమను చూపించి గెలిచిన తర్వాత బీసీ కులాలను విస్మరిస్తున్నాయన్నారు. అందుకే బీసీ రిజర్వేషన్లు కూడా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ మాట్లాడుతూ పార్టీలన్ని అధికారంలోకి వచ్చేందుకు ఆచరణ సాధ్యంకానీ హామీలు ఇచ్చి తర్వాత వాటిని అమలు చేయడం లేదన్నారు. కుల జనగణన బీసీ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, వివిధ పార్టీల నాయకులు కె.పర్వతాలు, నూనె వెంకటస్వామి, రాజేశ్, వనం సుధాకర్, సబ్బని లత, మారో సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ కాలేజీ అభివృద్ధికి సహకరించండి


ఎమ్మెల్యే తలసానిని కలిసిన పీఎల్ శ్రీనివాస్

**కంటోన్మెంట్:** సికింద్రాబాద్ ప్రాంతంలోని ప్రతిష్టాత్మక మహబూబ్ కాలేజీ అభివృద్ధికి సహకరించాలని కాలేజీ మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు పీఎల్ శ్రీనివాస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు జే.వినోద్ కుమార్‌తో పాటు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి మహబూబ్ కాలేజీ ప్రతిష్టను ఇనుమడింపచేసేలా తాము చేపడుతున్న కార్యక్రమాలకు విఘాతం కలిగేలా కొందరు ప్రవర్తిస్తున్నట్లు వారి దృష్టికి తీసుకెళ్లారు. ఎందరో ప్రముఖులు విద్యాభ్యాసం చేసిన మహబూబ్ కాలేజీని అభివృద్ధి చేసేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావడం సంతోషంగా ఉందని పీఎల్ శ్రీనివాస్ అన్నారు.

# మర్చిపోయిన ప్రయాణికుడి బ్యాగు అందజేత


ప్రయాణికుడి బ్యాగును అప్పగిస్తున్న కానిస్టేబుల్ హుస్సేన్

**సికింద్రాబాద్:** రైలు బోగీలో మర్చిపోయిన రూ. 10 వేల విలువ చేసే వస్తువులు కలిగిన లగేజీ బ్యాగును ఆర్పీఎఫ్ పోలీసులు ప్రయాణికుడికి అప్పగించారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ పి.రాములు కథనం ప్రకారం.. మెట్టుగూడ కేశవనగర్‌కు చెందిన భాస్కర్‌రావు గోదావరి ఎక్స్‌ప్రెస్ ద్వారా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఆయన ప్రయాణించిన బీ–1 బోగీలో తన లగేజీ బ్యాగును మర్చిపోయాడు. స్టేషన్ బయటకి వచ్చిన భాస్కర్‌రావు తన బ్యాగును మరిచిపోయిన విషయాన్ని గుర్తించి 139 నెంబరు ద్వారా రైల్వే కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కే.హుస్సేన్‌ను అప్రమత్తం చేయడం ద్వారా సదరు లగేజీ బ్యాగును గుర్తించి భాస్కర్‌రావుకు అప్పగించారు.

# రైల్వే మహిళా టీటీఈపై దాడి


గాయపడిన అణిని పరామర్శిస్తున్న మజ్దూర్ నాయకులు

**సికింద్రాబాద్:** రైలులో మహిళ ప్రయాణికురాలితో జరిగిన గొడవలో అదే బోగీలో విధులు నిర్వహిస్తున్న రైల్వే టీటీఈ వీజే అణి తీవ్రంగా గాయపడ్డారు. యశ్వంత్‌పూర్–గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో విధులు నిర్వహిస్తున్న అణిపై గురువారం వేగంగా నడుచుకుంటూ వచ్చిన ఒక మహిళ అదుపుతప్పి పడిపోయింది. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటమాట పెరిగి గొడవకు దారితీసింది. ఈ క్రమంలో ప్రతిగా టీటీఈ చేయిని సదరు మహిళ విరవడంతో తీవ్రంగా గాయమైంది. దక్షిణమధ్య రైల్వే కేంద్రీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అణిని మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి రవీందర్, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధర్, యూనియన్ నాయకులు చిలుకు స్వామి, నాగలక్ష్మి, నరసింహారెడ్డి, రాజిరెడ్డి, వినయ్, కుమార్, యుగంధర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన సదరు మహిళపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మహిళను వేధించిన వ్యక్తికి జైలు


మహ్మద్ సలీమ్

**చిలకలగూడ:** మహిళను వేధించడంతోపాటు పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, అడ్మిన్ ఎస్ఐ బాలరాజు వివరాల ప్రకారం.. చిలకలగూడకు చెందిన మహ్మద్ సలీమ్ (39) ఈ నెల 22న ఓ మహిళకు ఫోన్ చేసి వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సలీమ్‌ను అదుపులోకి తీసుకుంటుండగా పోలీసులపై తిరగబడి విధులకు ఆటంకం కలిగించాడు. సీపీ యాక్ట్ ప్రకారం ఈ–పెటీ కేసులు నమోదు చేసి గురువారం సికింద్రాబాద్ 15వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి రవిశంకర్ ఎదుట హాజరు పర్చగా ఏడు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

## దాడి ఘటనలో కానిస్టేబుల్‌తో సహా ముగ్గురిపై కేసు

**చిలకలగూడ:** వ్యక్తిపై దాడి జరిగిన ఘటనలో రిజర్వ్ కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరిపై కేసులు నమోదైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మెట్టుగూడ ఆలుగడ్డబావికి చెందిన గడప సారయ్య సాగర్ ప్రైవేటు ఉద్యోగి. డబ్బు బకాయి విషయమై అదే ప్రాంతానికి చెందిన మిథిలేష్‌కు ఇటీవల లీగల్ నోటీసులు పంపించాడు. తన సోదరి హర్షితతో కలిసి మిథిలేష్ ఈ నెల 25వ తేదీన సారయ్యసాగర్ ఇంటికి వెళ్లి గొడవ పడి, అసభ్య పదజాలంతో దూషిస్తూ సారయ్యసాగర్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పోలీసులకు ఆశ్రయించగా దాడి జరిగిన సమయంలో మిథిలేష్ బావమరిది, రిజర్వ్ కానిస్టేబుల్ సుశాంత్ అక్కడే ఉన్నాడని, ఆయన ప్రోద్బలంతోనే తనపై దాడి జరిగిందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మిథిలేష్, అతని సోదరి హర్షిత, రిజర్వ్ కానిస్టేబుల్ సుశాంత్‌పై కేసులు నమోదు చేశామన్నారు.

## ఒకరి బదులు మరొకరు రాసిన పరీక్ష

**కేసు నమోదు**

**సనత్‌నగర్:** ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలో మరొకరి బదులు పరీక్ష రాస్తూ పట్టుబడిన ఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శ్రీచైతన్య జూనియర్ కళాశాలకు చెందిన పల్లపోగు వైభవ్ (19) బుధవారం కామర్స్ పరీక్ష రాయాల్సి ఉండగా ఎస్సార్‌నగర్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో సెంటర్ పడింది. అయితే.. పల్లెపోగు వైభవ్‌కు బదులు అవినాష్ డిగ్రీ కళాశాలకు చెందిన గుండా సంజీవ్ (20) హాజరై పరీక్ష రాస్తుండగా ఇన్విజిలేటర్ మాధవీలత అనుమానంతో హాల్ టికెట్ పరీక్షించారు. వైభవ్‌కు బదులు సంజీవ్ పరీక్ష రాస్తున్నట్లు గుర్తించారు. వెంటనే అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ప్రిన్సిపాల్ స్వప్నకు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు ఎస్సార్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

**ముషీరాబాద్:** సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐటీయూ నగర కార్యాలయంలో నగర అధ్యక్షుడు జె.కుమారస్వామి గురువారం జెండాను ఎగురవేశారు. అనంతరం సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 'సరళీకృత ఆర్థిక విధానాలు–సవాళ్లు–కార్మిక వర్గ కర్తవ్యం' అనే అంశం మీద సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్తగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ హాజరై మాట్లాడుతూ గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం అవలంబించిన విధానాల వల్ల దేశంలో సంపద మొత్తం ఒక శాతంగా ఉన్న పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిందన్నారు. దేశంలో 50 కోట్ల మంది కార్మికులు పని చేస్తుండగా వారి నిజవేతనాలు పడిపోయాయన్నారు. ధరలు పెరిగాయి, ఉద్యోగులు ఊడిపోయాయి, ఇదంతా మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాల ఫలితమే అని మండిపడ్డారు. అంతేగాకుండా ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ శక్తుల చేతుల్లోకి పెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.వెంకటేశ్, నగర అధ్యక్షుడు జె.కుమారస్వామి, శ్రామిక మహిళా నగర కన్వీనర్ బి.కిరణ్మయి, నగర కోశాధికారి కె.అజయ్‌బాబు, నగర ఉపాధ్యక్షుడు జి.రాములు, నగర సహాయ కార్యదర్శి యాదమ్మ పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయాలి

**రౌండ్ టేబుల్ సమావేశంలో హైకోర్టు రిటైర్డు జడ్జి చంద్రకుమార్**



**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** తెలంగాణ ఉద్యమకారుల కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తి వేసి వారికి తగిన ప్రాధాన్యత కల్పించాలని హైకోర్టు రిటైర్డు జడ్జి చంద్రకుమార్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక ఆధ్వర్యంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరుతాయని అనుకున్నామని కానీ కేసీఆర్ అందుకు భిన్నంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కేసులు ఎత్తివేయకపోగా ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు యత్నించారని, అంతేగాకుండా ప్రజా ఉద్యమకారులపై పౌర హక్కుల సంఘం నేతలపై కూడా అనేక కేసులు పెట్టారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ఉత్సవాలు చేయడం సంతోషకరమని, అయితే రాష్ట్ర కల సాకారానికి కారణమైన ఉద్యమకారుల త్యాగాన్ని గుర్తించి కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక కన్వీనర్ జి.కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ రాపోలు ఆనందభాస్కర్, కోకన్వీనర్లు కృష్ణలత, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సోగరబేగం, బీఎస్ రాములు, పృథ్వీరాజ్, సిద్ధులు, కోల జనార్దన్, సూర్యం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.